ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య జిల్లా వార్తలు
5
బుధవారం 3 జనవరి 2024

మేము చెప్పినట్లే చేయాలి...!



మేము చెప్పిన వారికే పట్టాలు ఇవ్వాలి. అసైన్‌మెంట్ కమిటీతో సంబంధం లేదు అంటూ సుండుపల్లె మండలంలో ఓ అధికార పార్టీ నాయకుడు చెప్పిందే వేదంగా రెవెన్యూ అధికారులు నడుచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేదలకు దక్కాల్సిన పట్టాలను అధికార పార్టీ నాయకుడు చెప్పిన వారికి ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు వసూళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నారనే విమర్శలు జోరుగా వస్తున్నాయి.



ఇతర గ్రామస్థులు పట్టాలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్న స్థలం

సుండుపల్లె, జనవరి 2: అధికార పార్టీ నేతలు, నాయకులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా సుండుపల్లె రెవెన్యూ శాఖలో మాయాజాలం జరుగుతోందని ఆరోపణలు వస్తున్నాయి. భూములు లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని నిరుపేదలకు అసైన్‌మెంట్ కమిటీ సమావేశం ద్వారా వారిని గుర్తించి భూములు ఇవ్వాలి. అయితే దీనినే అదనుగా తీసుకుని మండలంలో కొంతమంది అధికార పార్టీ నాయకులు, అధికారులు వసూళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నారని జోరుగా విమర్శలు వస్తున్నాయి. ఓ ప్రజాప్రతినిధి చెప్పిన వారికే అసైన్‌మెంట్‌లో పట్టాలు మంజూరు చేయాలని హుకుం జారీ చేసినట్లు చర్చ జరుగుతోంది. మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయతీల్లో భూములు లేని నిరుపేదలు ఎంతోమంది ఉన్నారు. అలాంటి వారికి అసైన్‌మెంట్ చట్టం వర్తించేలా లేదు. ఎప్పటి నుంచో తమ ఆధీనంలో ఉన్న భూములకు సైతం పట్టాలు ఇప్పించుకోలేని దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ కొంతమంది అధికార పార్టీ నాయకులు వారి అనుచరులకు షరతులు లేకుండానే పట్టాలు పుట్టుకొచ్చేలా అధికారులతో లాలూచీ పడినట్లు కొంతమంది అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1000కి పైగా సాగు భూమి కోసం వినతులు అందాయి. అయితే 14 గ్రామ పంచాయతీల్లో నిజమైన అర్హులతో పాటు అధికార పార్టీ నాయకుల హామీలతో పట్టాలు పొందేందుకు చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కొంతమంది అధికారులకు ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సుండుపల్లెలో ఇంటి స్థలాలకు, వ్యవసాయ భూములకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల పల్లెల్లో గుట్టలు, పోరంబోకు స్థలాలను కాజేసేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తు న్నాయి. ఇప్పటికే మండల కేంద్రంలో అప్పన్న కుంటతో పాటు ఈదులవంక, అగ్రహారం గుట్ట, భైరవగుట్టతో పాటు పీలేరు రహదారిలోని పెట్రోల్ బంకు వెనుక భాగంలో ఉన్న 2140 సర్వే నెంబరులో లక్షలాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని అధికార పార్టీ నాయకులు అక్రమంగా అమ్ముకున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం చూస్తుంటే కంచె చేను మేస్తున్నట్లుగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వ స్థలాలను ప్రభుత్వ అవసరాలకు వినియోగించాల్సిన రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి దొంగ పట్టాలు జారీ చేసినా పై అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ఇదంతా అధికార పార్టీ అండదండలతో జరుగుతోందని చెబుతున్నారు. ఇప్పటికే కొంతమంది అసైన్‌మెంట్ కోసం వీఆర్‌వోలకు, సర్వేయర్లకు పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎలాగైనా పట్టాలు ఇప్పించండి అని కొంతమంది అధికార పార్టీ నాయకులకు కప్పం చెల్లించినట్లు విమర్శలు ఉన్నాయి.

- రెవెన్యూ అధికారులపై అధికార పార్టీ నేతల ఒత్తిడి
- అసైన్‌మెంట్ కమిటీ పేరుతో అయిన వారికే పట్టాలు
- మామూళ్ల మత్తులో రెవెన్యూ శాఖ
- పేదలకు పట్టాలు దక్కేనా ?

అర్హులను మాత్రమే గుర్తిస్తాము
- మహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్

మండలంలో అసైన్‌మెంట్ కోసం వెయ్యికి పైగా వినతులు వచ్చాయి. నిజమైన అర్హులను మాత్రమే గుర్తించి ఇంటి పట్టాలు పంపిణీ అయ్యేలా చూస్తాము. అనవసరంగా దళారులకు, అధికారులకు డబ్బులు ఇచ్చి నష్టపోకండి. రైతుల వద్ద ఎవరైనా డబ్బులు తీసుకున్నట్లు సమాచారం వస్తే చర్యలు తప్పవు. రైతులు దళారులను నమ్మి మోసపోకండి. ఒక గ్రామ పంచాయతీ వారికి మరో గ్రామ పంచాయతీలో పట్టాలు ఇవ్వము.

అప్పనంగా అప్పచెప్పేందుకు ప్రయత్నాలు

మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ బాలాజీబిడికి సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఇతర గ్రామ పంచాయతీలకు చెందిన కొంత మందికి పట్టాలు ఇప్పించేందుకు మడితాడు గ్రామ పంచాయతీకి చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఎంతోమంది గిరిజనులు భూములు లేక కూలి పనులకు వెళితే గానీ కడుపు నింపుకోలేని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. అలాంటి గిరిజనులకు ఆ గ్రామ పంచాయతీలో అసైన్‌మెంట్ కమిటీ సమావేశంలో అర్హులుగా గుర్తించి పట్టాలు ఇవ్వాలని గిరిజన నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

అధిపత్య పోరు, అక్రమాల కోసమే వీఆర్‌వోల మార్పు

మండల కేంద్రంలో సుండుపల్లె 1, 2, 3 సచివాలయాల్లో ఉన్న వీఆర్‌వోలను అధికార పార్టీ నాయకుల ఆధిపత్యం కోసం పదే పదే మారుస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల అక్రమాలకు వీఆర్‌వోలు సహకరించకపోతే మార్చేస్తాం. చెప్పింది చేయాల్సిందే అన్నట్లుగా నాయకుల తీరు ఉంది. అందుకు అనుగుణంగానే రెవెన్యూ అధికారులు కూడా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వందల సంఖ్యలో అక్రమ పట్టాలు పుట్టుకొచ్చాయి. ఈ అక్రమ పట్టాల వ్యవహారం వెనుక గతంలో పని చేసిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్, మరి కొంతమంది వీఆర్‌వోల హస్తం ఉందన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇప్పటికే సుండుపల్లెను దోచేశారు. అరకొరగా ఉన్న వాగులు, వంకలనైనా అధికారులు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



సుండుపల్లె తహసీల్దార్ కార్యాలయం

చలానా కట్టినా అధికారులు పలకరు
- వీరనాగయ్య, దళిత నాయకుడు



సుండుపల్లె గ్రామ పంచాయతీలోని సామినేనిగడ్డ సమీపంలోని సర్వే నెంబరు 1251లో సర్వే చేసి పట్టా భూమికి హద్దులు చూపించమని చలానా కట్టినా అధికారులు పట్టించుకోవడం లేదు. పలుమార్లు మండల సర్వేయర్‌కు, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. ఈ ప్రభుత్వంలో బడా నాయకులకు తప్ప సామాన్యులకు పని జరగదు. ప్రభుత్వానికి చలానా కట్టినా కూడా తమ ఆధీనంలో ఉన్న పొలానికి హద్దులు చూపించకపోవడం బాధగా ఉంది. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. నా పొలానికి హద్దులు చూపించండి.

గిరిజనులకు పట్టాలు ఇవ్వాలి
- ఆనంద్‌నాయక్, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు



గిరిజన గ్రామ పంచాయతీ మాచిరెడ్డిగారిపల్లెలో భూములు లేని నిరుపేద రైతులకు అసైన్‌మెంట్ కమిటీలో భూములు ఇవ్వాలి. కొంతమంది అధికార పార్టీ నాయకులు ఇతర గ్రామ పంచాయతీలకు చెందిన వైసీపీ నాయకులకు పట్టాలు ఇప్పించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ నాయకులకు, కార్యకర్తలకే కాకుండా నిజమైన అర్హులకు న్యాయం చేయాలి. అధికారం ఉంది కదా అని ఇష్టారాజ్యంగా అసైన్‌మెంట్ కమిటీలో వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాము.

సెబ్ కమిషనర్‌గా పీలేరు వాసి
- బాధ్యతలు స్వీకరించిన రవిప్రకాశ్



బాధ్యతలు స్వీకరిస్తున్న రవిప్రకాశ్

పీలేరు, జనవరి 2: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కమిషనర్‌గా పీలేరు వాసి ఎం.రవిప్రకాశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనది పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ బండమీదపల్లె గ్రామం. ఆయన తండ్రి ఎం.రామచంద్రయ్య పోలీసు శాఖలో డీఎస్పీగా పదవీ విరమణ పొంది పీలేరు అయ్యప్పరెడ్డి కాలనీలో స్థిరపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ఎస్పీ, డీఐజీగా సమర్థవంతంగా పనిచేసిన రవిప్రకాశ్‌కు ప్రభుత్వం ఇటీవల ఐజీగా పదోన్నతి కల్పించింది. డీఐజీ హోదాలో సెబ్ డైరెక్టర్‌గా పనిచేస్తుండిన ఆయన పదోన్నతి కారణంగా అదే శాఖకు కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆయనకు ఇదివరకు ప్రెసిడెంట్ మెడల్, సీఎం గ్యాలంట్రీ అవార్డులు లభించాయి. ఆయన సోదరుడు ఎం.కిరణ్‌కుమార్ ప్రస్తుతం తిరుపతి జిల్లా గూడూరు ఆర్డీవోగా పనిచేస్తున్నారు. రవిప్రకాశ్‌కు ఐజీ, కమిషనర్ పదోన్నతి లభించిన విషయం తెలుసుకున్న స్థానికులు ఆయన తండ్రి రామచంద్రయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి: కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 2: జిల్లాలో ఎలాంటి తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపొందించడమే మనందరి లక్ష్యం. ముసాయిదా ఓటరు జాబితాలోని తప్పొప్పులను పూర్తిగా పరిష్కరించాలని కలెక్టర్ పీఎస్ గిరీషా ఈఆర్‌వోలు, తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లా తుది జాబితా రూపకల్పన, రెవెన్యూ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి బీఎల్‌వోను కార్యాలయానికి పిలిపించుకుని వారి లాగిన్స్‌లో పెండింగ్‌లను వెంటనే క్లియర్ చేయించాలని ఈఆర్‌ఓలకు తెలిపారు. సరిగ్గా విధులు నిర్వహించని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా లాగిన్‌లలో జనరేట్ అయిన ఫారం-7, 8లను వెంటనే అప్రూవ్ చేయాలన్నారు. పీఎస్ఈ, డీఎస్ఈ అంశంలో ఏడు, 15, 30 రోజులు పైబడిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఆయా మండలాల్లో ఫారం-6లో వచ్చిన దరఖాస్తులు, పరిష్కారం, పెండింగ్‌పై ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళికను వెంటనే రూపొందించాలన్నారు. మండలాల వారీగా కూడా ఎన్నికల నిర్వహణ ప్రణాళికను రూపొందించి శుక్రవారం లోపు జిల్లా కేంద్రానికి పంపాలన్నారు. బీఎల్‌వోల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. రెవెన్యూ అంశంలో భాగంగా ఉత్తర్వులు జారీ చేసిన అసైన్‌మెంట్ భూములు డిజిటల్ సిగ్నేచర్ వెంటనే పూర్తి చేయాలన్నారు. అసైన్‌మెంట్ భూముల రీవెరిఫికేషన్ కూడా త్వరితగతిన పూర్తి చేయాలని, చుక్కల, ఈనాం భూముల అంశంలో మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవోలు రంగస్వామి, రామక్రిష్ణారెడ్డి, మురళి, నియోజకవర్గ ఈఆర్‌వోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

వ్యవసాయ పంట రుణాలు విరివిగా ఇవ్వాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 2: రైతులకు వ్యవసాయ పంట రుణాలు విరివిగా మంజూరు చేయాలని కలెక్టర్ పీఎస్ గిరీషా బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డీఎల్‌టీసీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి వరి పంటకు ఎకరాకు రూ.47 వేలు క్రాప్‌లోను మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా వేరుశనగ పంటకు రూ.36 వేలు, అరటి మొదటి రకం రూ.1.25 లక్షలు, రెండవ రకానికి రూ.70 వేలు, బొప్పాయి పంటకు ఎకరాకు రూ.80 వేలు, వంకాయ పంటకు రూ.40 వేలు, ఉర్లగడ్డ పంటకు రూ.50 వేలు, ఉల్లిగడ్డ పంటకు రూ.46 వేలు, టమోటా పంటకు రూ.80 వేల నుంచి లక్ష వరకు రుణం మంజూరు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. పైన నిర్దేశించిన రుణాలను బ్యాంకర్లు రైతులకు మంజూరు చేసి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, ఇందుకు సంబంధించి అన్ని రకాల బ్యాంకుల శాఖలు అర్హత పొందిన లబ్ధిదారులకు వెంటనే రుణాలు అందించాలని బ్యాంకు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యువ పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అర్హత మేరకు రుణాలు మంజూరు చేసి ఉపాధి కల్పనకు తోడ్పాటును అందించి జిల్లా అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, అగ్రికల్చర్ జేడీ చంద్రానాయక్, పశు సంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు
- వారం రోజుల్లోగా వివరణ ఇవ్వండి : అధికారులు



రాయచోటిలో మెడకు ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

రాయచోటి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ఇంకా నెరవేర్చకపోవడంతో ప్రభుత్వానికి సమ్మె నోటీసును ఇవ్వడమే సమగ్ర శిక్ష ఉద్యోగుల నేరమైంది. ఒప్పందాన్ని అతిక్రమించి ఉన్నతాధికారులకు సరైన సమాచారం ఇవ్వకుండా.. విధులకు గైర్హాజరైన మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో.. వారం రోజుల్లోగా రాతపూర్వక వివరణ ఇవ్వాలని సమగ్ర శిక్ష ప్రాజెక్టు అడిషనల్ కో-ఆర్డినేటర్ కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేశారు. గత నెల 29న రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెం, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, వీరబల్లి కస్తూర్బా పాఠశాలల్లో (సీఆర్‌టీ) కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతు ఇచ్చారు. తమ సమస్యలు కూడా పరిష్కరించాలని కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చారు. దీనిపై సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. త్వరలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారుల అనుమతితో పాటు సరైన కారణం లేకుండా విధులకు రాలేదనే కారణంతో ఈ నోటీసులు జారీ చేశారు. మీపైన ఎందుకు క్రమశిక్షణా చర్యలు తీసుకోకూడదో తెలపాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. దీనిపైన సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వంపైన మండిపడుతున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం రాష్ట్రంలో అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగులు అందరినీ రెగ్యులర్ చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఏర్పడి సుమారు ఐదు సంవత్సరాలు అవుతున్నా.. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోవడంతో వారు ప్రభుత్వానికి సమ్మె నోటీసును ఇచ్చారు. దీనిపైన సమగ్ర శిక్ష అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం సమ్మెలో భాగంగా ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఉద్యోగుల న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి మీ సమస్యలు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు మెడకు ఉరితాళ్లు వేసుకుని తమ నిరసన తెలిపారు. 10 రోజులుగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెలో ఉన్నారు.

పొర్లుదండాలు.. దున్నపోతులకు వినతులు



లక్కిరెడ్డిపల్లెలో ఒంటెకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు



రాయచోటిలో దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలుపుతున్న అంగన్వాడీ వర్కర్లు



రైల్వేకోడూరులో గేదె దూడకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

- ఉధృతంగా అంగన్వాడీల సమ్మె
- 5వ తేదీ లోగా విధుల్లో చేరాలంటూ ప్రభుత్వం అల్టిమేటం
- నేడు అంగన్వాడీల కలెక్టరేట్ ముట్టడి

రాయచోటి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచడంతో పాటు గ్రాట్యుటీ అమలు వంటి అనేక డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు 22వ రోజు మంగళవారం ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా పొర్లుదండాలు పెట్టడం, దున్నపోతులకు వినతిపత్రాలు ఇచ్చి తమ నిరసనను తెలిపారు. తమ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం చొరవ చూపకపోగా ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తోందని అంగన్వాడీలు ఆరోపిస్తున్నారు. అంగన్వాడీలు సమ్మెలోకి వెళ్లడంతో సచివాలయ సిబ్బందితో అంగన్వాడీ సెంటర్లను బలవంతంగా తెరిపించింది. పిల్లలు, తల్లులకు పౌష్టికాహారం పంపిణీ చేయాలని ప్రయత్నం చేసింది. అయితే దాదాపు ఏ అంగన్వాడీ స్కూల్‌కు పిల్లలను తమ తల్లులు పంపలేదు. దీంతో పేరుకు అంగన్వాడీ సెంటర్లు తెరిచి ఉన్నా పౌష్టికాహారం పంపిణీ జరగడం లేదు. అయినా అంగన్వాడీలు ఎక్కడా వెనక్కి తగ్గకుండా ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ 22 రోజులుగా సమ్మెలోనే ఉన్నారు. ప్రభుత్వంతో అంగన్వాడీ యూనియన్ల చర్చలు సఫలం కాకపోవడంతో ఈనెల 5లోగా అంగన్వాడీలు సమ్మెను విరమించి విధుల్లో చేరాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రభుత్వం హెచ్చరించింది. అయితే ఈ బెదిరింపులకు భయపడమని అంగన్వాడీలు పేర్కొంటున్నారు. ఈ నెల 3న కలెక్టరేట్ల ముట్టడికి అంగన్వాడీలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీల సమ్మె ఎన్నికల ముందు ఎన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

రాయచోటి ప్రాజెక్టు పరిధిలో మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి తమ నిరసన తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) అన్నమయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మి, ప్రాజెక్టు లీడర్లు బంగారుపాప, ఖాజాబీ, విజయ, మస్రూన్‌బీ తదితరుల ఆధ్వర్యంలో అంగన్వాడీల నిరసనలు జరిగాయి. పట్టణంలోని పాతరాయచోటిలో, మండల పరిధిలోని ఏపిలవంకపల్లెతో పాటు రాయచోటి ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్వాడీ సెక్టార్ల పరిధిలో దున్నపోతుకు వినతిపత్రాలు ఇచ్చి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. లక్కిరెడ్డిపల్లెలో వినూత్నంగా ఒంటెకు వినతిపత్రం ఇచ్చారు.

మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా చేశారు. 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం వినిపించుకోలేదని, దున్నపోతు అయినా తమ సమస్యలు వింటుందేమోనని దిగువ కమ్మపల్లె వద్ద వినతిపత్రం అందజేశారు. తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండెం మండలాలకు చెందిన అంగన్వాడీలు, హెల్పర్లు తంబళ్లపల్లె మూడురోడ్ల కూడలిలో కూర్చుని నిరసన తెలిపారు. బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు పాటలు పాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నెత్తిన కొంగులు కప్పుకొని దండాలు పెడుతూ నిరసన తెలిపారు. అంగన్వాడీ లీడర్లు శ్రీవాణి, కుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను తీర్చకపోగా సమ్మె విరమించి విధుల్లో చేరాలని భయపెడుతోందని విమర్శించారు. వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పొర్లుదండాలు పెడుతూ వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీ కార్యకర్తలను బెదిరించే ప్రయత్నం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, అమ్మాజీ, ప్రసన్న, గులాబ్ జాన్, దేవసేన పాల్గొన్నారు. 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో బుధవారం కలెక్టరేట్ ముట్టడికి అంగన్వాడీలు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సెక్టార్ల నుంచి అంగన్వాడీలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ముట్టడికి అనుమతి లేదు : అంగన్వాడీలు బుధవారం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడికి అనుమతి లేదని అంగన్వాడీ, సీఐటీయూ, కార్మిక నాయకులు పోలీసులు సెక్షన్ 149 ప్రకారం నోటీసులు ఇచ్చారు. శాంతిభద్రతల నేపథ్యంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా మీరే బాధ్యులని నోటీసులో హెచ్చరించారు.



బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నెత్తిన కొంగువేసుకుని దండాలు పెడుతున్న అంగన్వాడీ వర్కర్లు

సాధికార బస్సు యాత్ర కోసం రైల్వేకోడూరు అష్టదిగ్బంధం!

- నేడు ప్రైవేటు స్కూళ్లు మూసివేయాలని ఆదేశం
- జనాల కోసం స్కూలు బస్సులు ఏర్పాటు చేయాలని హుకుం..!
- భారీగా ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం

రైల్వేకోడూరు, జనవరి 2: వైసీపీ సాధికార బస్సు యాత్ర బుధవారం రైల్వేకోడూరులో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం మంగళవారం రైల్వేకోడూరు వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ప్రధాన రహదారి వరకు అష్టదిగ్బంధం చేస్తున్నారు. బుధవారం పట్టణంలోని అన్ని ప్రైవేటు స్కూళ్ల ను మూసివేయాలని అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని స్కూళ్ల యాజమాన్యాలు సెలవు ప్రకటించారు. అదేకాకుండా స్కూళ్ల బస్సుల ద్వారా ప్రజలను సభకు తరలించాలని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలకు హుకుం జారీ చేశారు. వైసీపీ సాధికార బస్సు యాత్రతో భారీగా ట్రాఫిక్ సమస్యను ప్రజలు ఎదుర్కోనున్నారు. రైల్వేకోడూరులో ఒక్క ప్రధాన రహదారి మాత్రమే ఉంది. బైపాస్ రోడ్డు కూడా లేదు. మహారాష్ట్ర, హైదరాబాద్, కర్నూలు, కడప, రాజంపేట వాసులు నిత్యం తమిళనాడు, తిరుపతి, తిరుమలకు వెళుతుంటారు. ఇటు తిరుపతి, అటు కడప రూటులో భారీగా వాహనాలు తిరుగుతుంటాయి.




రైల్వేకోడూరులో క్రేన్‌తో వైసీపీ జెండాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం, బస్సు యాత్ర సభ నిర్వహించే స్థలం ఇదే

బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు సాధికార సభ ఉంటుం ది. ఉదయం 11 గంటల నుంచి ర్యాలీ ఉంటుంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడుతుంది. ఊరికి దూరంగా చాలా విశాలమైన ప్రాంగణాలున్నా కడప-తిరుపతి ప్రధాన దారిలో బస్సు యాత్ర పెట్టడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రోడ్డు డివైడర్‌పై వైసీపీ జెండాలు నాటారు. పెద్ద క్రేన్‌తో జెండాలు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ అటవీశాఖ అతిథిగృహం ప్రాంగణంలో భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. వైసీపీ బస్సు యాత్రతో అటు కుక్కలదొడ్డి నుంచి ఇటు ఓబులవారిపల్లె వరకు వాహనాలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ట్రాఫిక్ సమస్యను పోలీసులు ఎలా అరికడతారో వేచి చూడాల్సిందే. కాగా ట్రాఫి క్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా సూరపురాజుపల్లె నుంచి రాఘవ రాజపురం మీదుగా మళ్లిస్తామని చెబుతున్నారు. ఇది పూర్తిగా పల్లెల దారి, సింగిల్ రోడ్డు కావడంతో పెద్ద వాహనాలు వస్తే ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుం దని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తాం

వైసీపీ నిర్వహిస్తున్న సాధికార బస్సు యాత్రకు అను మతి ఉంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండలంలోని సూరపు రాజుపల్లె నుంచి రాఘవరాజపురం వరకు దారి మళ్లించాం. వాహన దారుల అవగాహన కోసం పోలీసుల సమక్షంలో ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

-మధుసూదన్‌రెడ్డి, సీఐ, రైల్వేకోడూరు.

పంచాయతీరాజ్ రాష్ట్ర సదస్సును జయప్రదంచేయండి

కడప రూరల్, జనవరి 2: గుంటూరు జిల్లా మంగళగిరిలో జనవరి 3న నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ రాష్ట్ర సదస్సులో పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు పాల్గొని జయప్రదం చేయాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. అందుకే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరూ పాల్గొని 16 డిమాండ్ల సాధనకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

అప్రెంటీస్‌కు ఎంపికైన వారు 8న హాజరు కావాలి

కడప (మారుతీనగర్), జనవరి 2: ఏపీఎస్ ఆర్టీసీ అప్రెంటీషిప్‌కు ఎంపికైన జిల్లాలోని ఐటీఐ అభ్యర్థులు ఈనెల 8వ తేదీ ఉదయం 9 గంటలకు కర్నూలులోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజిలో హాజరు కావాలని కడప ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ కె.రత్నరాజు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, కుల ధ్రువీకరణ పత్రం, వికలత్వ ధ్రువీకరణపత్రం, పాన్‌కార్డ్, ప్రభుత్వం జారీచేసిన ఐడీ ప్రూఫ్, బ్యాంక్ ఖాతా పాస్‌బుక్, 3 ఫొటోలు, ఆధార్‌కార్డుతో సహా 3 సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఎంపికైన అభ్యర్థుల వివరాలిలా....

డీజల్ మెకానిక్ విభాగంలో... 189, 67, 96, 164. 158, 185, 22, 32, 183, 210, 139, 104, 78, 151, 176, 204, 252, 148, 10, 196, 216, 130, 6, 153, 193, 63, 92, 76, 212, 108, 179, 194, 195, 161, 87, 137, 88, 165, 192, 95, 186, 177, 18, 56, 25, 33, 198

మోటార్ మెకానిక్ విభాగంలో...... 37, 23, 29, 20, 8, 43, 50, 38,

ఎలక్ట్రీషియన్.. 3, 56, 30, 59,

వెల్డర్... 01, **మెషనిస్ట్....** 3, 20, **ఫిట్టర్...**8, 26

డ్రాఫ్ట్‌మాన్ (సివిల్) 24, 15 రిజిస్ట్రేషన్ నెంబర్లు గల వారు ఏదేని ఇతర వివరాలకు కడప ఐటీఐ సర్కిల్‌లోని తమ డీఎల్‌టీసీ కాలేజిలోని అప్రెంటీస్ అడ్వసర్‌ను సంప్రదించాలని కోరారు.

ఒక్క క్లిక్‌తో సమగ్ర సమాచారం

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్



సీఎంఎస్‌ని ప్రారంభిస్తున్న వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 2: వైవీయూలో జరిగే ప్రతి కార్యక్రమం వెబ్‌సైట్ కాన్ఫరెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టంలో అందుబాటులో ఉంటుందని... ఒక్క క్లిక్‌తో సమగ్ర సమాచారం పొందవచ్చని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ అన్నారు. మంగళవారం వైవీయూ ఐటీ అండ్ నెట్‌వర్కింగ్ సెల్ సంచాలకులు ప్రొఫెసరు ఎంవీ శంకర్ నేతృత్వంలో రూపకల్పన చేసిన సీఎంసిస్టంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్శిటిలో నిర్వహించే కాన్ఫరెన్స్ సెమినార్ వర్క్‌షాపుల బ్రోచర్లు, రిజిస్ట్రేషన్ వెబ్ లింకు, చెల్లింపు ఎంపికలు కమిటీ సమాచారం, ప్రోగ్రాం షెడ్యూలు, స్పీకర్ ప్రొఫైల్, ఫొటోగ్రాఫ్, సర్క్యులర్లు, సంప్రదించాల్సిన వారి సమాచారం ఇలా అనేక వివరాలు ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చన్నారు. అనంతరం రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఐక్యు ఏసీ డైరెక్టరు సుబ్రహ్మణ్య శర్మ, సీడీసీ డీన్ ప్రొఫెసరు రవిబాబు, దాము, విజయభారతి, ఎస్వీక్రిష్ణారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

వైవీయూ ఎంబీఏ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ అన్నారు. వైవీయూ గురుకుల భవనాలను రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ఏడాది ఎంబీఏ, హెచ్ఆర్ఎం కామర్స్ కోర్సుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిన దృష్ట్యా తరగతి గదుల నవీకరణ చేస్తామన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లపై వైవీయూ ఇంజనీరుతో చర్చించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి అమృత్ ప్రసాద్‌రెడ్డి, ఎస్వీ సుబ్బారెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ గంగయ్య పాల్గొన్నారు.


పశువులకు తప్పక టీకాలు వేయించుకోవాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్

కడప రూరల్, జనవరి 2: గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకుని తమ పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పోస్టర్లను జేసీ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జనవరి 2 నుంచి 31 వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేస్తారన్నారు. ఇందుకు 400700 డోసులు సరఫరా చేసి పాడి రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. జిల్లాలోని పశుపోషకులు ప్రభుత్వం అందించే ఈ ఉచిత టీకాలను తమ పశువులకు వేయించుకుని గాలికుంటు వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవాలని కోరారు. పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, నోటి మధ్య, కాలిగిట్టల మధ్య పుండ్లు, సూడి పశువులు ఈసుకుపోవడం ఈ వ్యాధి ముఖ్య లక్షణాలన్నారు. వ్యాధి సోకిన పశువులలో పాల ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. కాబట్టి రైతులు పశువు లకు టీకాలు తప్పకుండా వేయించుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.



అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి




ఉరి వేసుకుని మృతి చెందిన బాలుడు, అనిమేష్ (ఫైల్)

వల్లూరు, జనవరి 2: మండల కేంద్రమైన వల్లూరులోని ఈద్గా సమీపంలో మంగళవారం వేప చెట్టుకు చీరతో ఉరి వేసుకుని అనిమేష్ (16)అనే బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కొప్పోలు దళితవా డ గ్రామానికి చెందిన పొట్లి క్రిష్ణ కుమారుడు పొట్లి అనిమేష్ జనవరి 1న సినిమాకు వెళుతున్నానని ఇంటి వద్ద చెప్పి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో మంగళవారం బాలుడి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల విచారించినా ఆచూకీ లభించలేదు. అయితే బాలుడి తండ్రి వేరే చోట పనివద్ద ఉండగా, మీ కుమారుడు ఉరి వేసుకుని చనిపోయాడని స్థానికులు ఫోను ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో అతను హుటాహుటిన సంఘటనాస్థలం వద్దకు వచ్చి తమ కుమారుడని నిర్ధారించారు. సీఐ రామక్రిష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. బాలుడి తండ్రి క్రిష్ణ తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు. అనంతరం బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

కడప (క్రైం), జనవరి 2: కడప-కనుమలోపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కమలాపురానికి చెందిన మీగడ వీరశివారెడ్డి (30) లారీ డ్రైవరుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా మంగళవారం ఇంటి వద్ద నుంచి కడపకు వచ్చి జేఎంజె కళాశాల సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బి.కోడూరు, జనవరి 2: మండల పరిధిలోని కొండంపల్లె గ్రామానికి చెందిన యాసాని సుబ్బరాయుడు (70) సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. సుబ్బరాయుడు బద్వేలుకు వెళుతుండగా పశువులు అడ్డుగా రావడంతో అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప (క్రైం), జనవరి 2: మాధవరం-1 సమీపంలోని రైల్వే ట్రాక్‌పై మంగళవారం తెల్లవారుజామున రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి (30) మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. తిరుపతి వైపు వెళ్లే రైలు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అమూల్ పాలసేకరణ 90 శాతం జరగాలి : కలెక్టర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పీఎస్ గిరీషా

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 2: జిల్లాలో పాడి రైతుల నుంచి అమూల్ పాలసేకరణ పక్కాగా జరిగేలా చూడాలని కలెక్టర్ పీఎస్ గిరీషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాలో పాలసేకరణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి వివరించి.. అమూల్‌కు పాలసేకరణ 90 శాతం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జగనన్న పాల వెల్లువ ప్రాముఖ్యతను అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు ప్రజాప్రతినిధుల సహకారంతో పాడి రైతులకు తెలియజేసి అమూల్‌కు పాలుపోసే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం ప్రభుత్వ విప్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం, గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పశువర్ధకశాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

2024లోనూ మోదీయే ప్రధాని

హ్యాట్రిక్ సాధించనున్న బీజేపీ ప్రభుత్వం : సాయిలోకేశ్



రామాపురం, జనవరి2: 2024లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటై మళ్లీ నరేంద్రమోదీ ప్రధాన మంత్రి అవుతారని, బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధిస్తుందని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. గువ్వలచెరువులో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గం చాలా వెనుకబడిన ప్రాంతమని, పారిశ్రామిక అభివృద్ధి లేకపోవడం, సకాలంలో వర్షాలు కురవక రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో యువతకు ఉపాధి కల్పనలో భాగంగా జరిగే విధంగా చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వీక్షిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా అర్హులైన మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇస్తారన్నారు. దేశంలోనే అతి పెద్ద ఇన్సూరెన్స్ పథకాన్ని పీఎంజేవై జీవనజ్యోతి బీమా, ఆవాస యోజన బీమా, సురక్ష బీమా యోజన పథకాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. మండలంలో వందెకరాలు ప్రభుత్వ భూమి కేటాయిస్తే ఈ విషయాన్ని కేంద్ర క్రీడా మంత్రి దృష్టికి తీసుకెళ్లి బీజేపీ ఒలింపిక్ స్టేడియాన్ని క్రీడలకు ఏర్పాటు చేస్తామన్నారు. ఉపాధి లేక కరువు పరిస్థితుల కారణంగా కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, జీవనో పాధి జరగడమే కష్టంగా ఉందని, కనుక వంద రోజుల పాటు ఇంకా 50 రోజులు ఉపాధి కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఐదు లక్షల వరకు శస్త్రచికిత్స కోసం, పీఎం ఆవాజ్ యోజన పథకం కింద నిరుపేద కుటుంబాలకు పక్కా గృహాలు నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తాను ఇచ్చినట్టుగా గొప్పలు చెప్పకుంటోందన్నారు. ఏపీలో మాత్రం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షులు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ గుండె గుభిల్లు మనేలా డప్పుకొట్టాలి

- నిరసనలతో రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సత్తా చాటాలి
- మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలంటూ డప్పుల ర్యాలీతో వినూత్న నిరసన



రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట డప్పు కొడుతూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రాయచోటిటౌన్, జనవరి2: అమరావతి ప్యాలెస్‌లో ఉన్న సీఎం జగన్ గుండె గుబేలు మనేలా డప్పు కొట్టాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ కార్మికుల సమ్మె 7వ రోజుకు చేరకుంది. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, రాంబాబు మున్సిపల్ కార్మికులు డప్పు చేతబట్టి మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండు సర్కిల్ మీదుగా గాలివీడు రోడ్డు, కంసలవీధి, ఠానా, నేతాజీ సర్కిల్, బస్టాండు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీతో ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్ర, అసెంబ్లీలోనూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగున్నరేళ్ల పాలనలో మున్సిపల్ ఉద్యోగ కార్మికులు తమ సమస్యలు పరిష్కారించాలని ప్రభుత్వ పెద్దలను అభ్యర్థించి వినతులు సమర్పించినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో విసిగిపోయిన కార్మికులు సమ్మెబాట పట్టాల్సి వచ్చిందన్నారు. ప్రతిపక్ష నేతగా ప్రస్తుత సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికశాఖ ప్రతిపాదనల మేరకు జీఓ ఆర్టీ నెంబర్ 30 ప్రకారం పంపు ఆపరేటర్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్స్, వర్క్ ఇన్స్‌పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, స్ట్రీట్ లైటింగ్, టౌన్ ప్లానింగ్, ఆఫీసు నిర్వహణ కార్మికులకు వేతనాలు పెంచుతామని మూడేళ్లుగా హామీలతోనే సరిపెడుతున్నారని విమర్శించారు. ఈ సమ్మెతోనైనా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగి సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక నేతలు సిద్దయ్య, పెద్ద మంగమ్మ, తిరుపతమ్మ, అంజనేయులు, రవికుమార్, వెంకట్రమణ, రమణమ్మ పాల్గొన్నారు.

పెనుశిల గోశాలలో గోమాత మృతి

అంతిమ సంస్కారాలు పూర్తి



గోమాతకు అంతిమ సంస్కారాలు చేస్తున్న దృశ్యం

సిద్దవటం, జనవరి2: మొహిద్దీన్ సాహెపల్లెలోని నరసింహస్వామి గోశాలట్రస్ట్‌లో గోమాత మృతి చెందడంతో సంప్రదాయంగా ఆవుల మారమ్మ గుట్టపై అంతిమ సంస్కారాలు చేశారు. గోవులు వ్యర్థపదార్థాలు, ప్లాస్టిక్ కవర్లు తిని మృత్యువాత పడుతున్నాయని ప్రతి ఒక్కరూ దయ చేసి ప్లాస్టిక్ కవర్లను ఎక్కడపడితే అక్కడ వేయరాదని సూచిస్తూ గోవులను పూజించాలని తెలిపారు.

వైద్యసేవలు అందించాలి

సిద్దవటం, జనవరి2: బొగ్గిడివారిపల్లెలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. వైద్య పరీక్షలకు వచ్చిన పేషెంట్లు వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయాలని మొదటి విడతలో జరిగిన ప్రోగ్రాం పేషెంట్లు బాగా వచ్చారని, రెండో విడతలో పేషెంట్లుగా సంఖ్య పెరిగేలా కృషి చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు.

కోర్టులో న్యూఇయర్ వేడుకలు



కోర్టులో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

నందలూరు, జనవరి2: జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం జూనియర్ సివిల్ జడ్జి కోలార్ లత ఆధ్వర్యంలో చేసుకున్నారు. ముందుగా కేక్ కట్ చేసి న్యాయవాదులందరికీ ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ ఏడాదంతా మంచి జరగాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి నరసింహులు, ప్రధాన కార్యదర్శి గొబ్బిళ్ల సుబ్బరామయ్య, వైస్ ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్ అలీ, ఏజీపీ షమీఉల్లా ఖాన్, ఏవి సుబ్రహ్మణ్యం, నాయనపల్లి అనుదీప్, జయసింహ, మోహన్, మహమ్మద్ అలీ, నూరు, ఆకేపాటి శివ శంకర్‌రెడ్డి, మాడపూరి నళిని, మీనా పాల్గొన్నారు.

పశువులకు వినతుల సమర్పణ

- ఒంటె, గేదె, దున్నపోతులకు అంగన్వాడీలు సమర్పిస్తున్న వినతులు
- సమస్య పరిష్కారమయ్యే వరకూ సమ్మె ఆగదని తేల్చిన వైనం
- సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరిక



రాయచోటిలో గేదె దూడకు, టి. సుండుపల్లెలో, సంబేపల్లెలో దున్నపోతుకు వినతి పత్రం సమర్పిస్తున్న అంగన్వాడీ వర్కర్లు

రైల్వేకోడూరు, జనవరి 2: పచ్చగడ్డి వేస్తే పాలిచ్చి కడుపు నింపే పశువులే నయమని, వాటికి వినతులు సమర్పిస్తేనైనా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం వస్తుందేమోనని అంగన్వాడీలు మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపుపై పలు ప్రాంతాల్లో పశువులకు వినతులు సమర్పించారు. లక్కిరెడ్డిపల్లెలో ఒంటెకు వినతి పత్రం సమర్పించారు. వివరాల్లోకెళితే.....

పట్టణంలో మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కలసి వినూత్నంగా నిరసనలు వ్యక్తం చేశారు. గేదె దూడకు వినతిపత్రం సమర్పించారు. అంగన్వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారించకుండా మొద్దు నిద్రపోతుందని ఆరోపించారు. అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాల సమస్యలను మనుషులకు చెప్పుకుంటే సమస్యలు ఎలాగో తీరవని, పశువులకు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఎదుట తమ నేతలు ఉంచారన్నారు. అయితే ఇంత వరకూ ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. 22 రోజులుగా అంగన్వాడీలు నిరసనలు తెలియజేస్తుంటే ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేకుండా ఉందన్నారు. తమ సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. లేకపోతే దశల వారీ ఆందోళనలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు అంగన్వాడీ సంఘం అధ్యక్షురాలు రమాదేవి, లీలా, దుర్గా, శిరీషా, రాధ, జిల్లా సీఐటీయూ అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు జాన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె ఆగదు

రాయచోటిటౌన్, జనవరి2: సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె ఆపే ప్రసక్తే లేదని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొమ్మరాజు భాగ్యలక్ష్మీ, ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ, మండల ప్రధాన కార్యదర్శి అరుణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి రావాలని వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపిన వారు మాట్లాడుతూ వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర విషయాల్లో ప్రభుత్వం నోరు మెదపడంలేదన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని గతంలో జరిగిన చర్చల్లో అంగీకరించారని, ఇప్పటి వరకూ జీఓ ఇవ్వలేదన్నారు. అంగన్వాడీ గ్రేడ్-2 సూపర్‌వైజర్ 560 పోస్టులు ఇచ్చామని మంత్రి ఉషశ్రీచరణ్ అబద్దాలు ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్లు విజయమ్మ, రామాంజులమ్మ, నాగమణి, అరుణ, మస్రూన్‌బీ, సు మలత, వనజ, ప్రవీణ, సబీనా, రమీజా, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో....

సుండుపల్లె, జనవరి2: రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా వినూత్నంగా దున్నపోతుకు వినతి పత్రం ఇచ్చారు. ఏఐటీయూసీ జిల్లా నాయకురాలు నాగేశ్వరి మాట్లాడుతూ పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించినా లెక్కచేయకుండా అంగన్వాడీల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం ప్రవర్తిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లీడర్లు సుజాత, అనురాధ, సెక్టారు లీడర్లు రజిని, లోకేశ్వరి, సుజాత, పద్మావతమ్మ, రామతులసమ్మ, సంధ్య, రేణుక, తులసి, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం విఫలం

లక్కిరెడ్డిపల్లె,జనవరి2: ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో విఫలమైందని ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి పేర్కొన్నారు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టి మంగళవారం ఒంటెలకు వినతి పత్రం అందజేసిన ఆమె మాట్లాడుతూ పాదయాత్రలో అంగన్‌వాడీల గురించి చిలకపలుకులు పలికి అధికారంలో రాగానే చిరుద్యోగులైన అంగన్‌వాడీలు సమస్యలు ప్రభుత్వానికి పట్టడంలేదన్నారు. యూనియన్ నేతలు,సెక్టార్ లీడర్లు మూడు మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు

అంగన్వాడీల వినూత్న నిరసన

సంబేపల్లె, జనవరి2: మండల వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం వినూత్న నిరసన తెలియ జేశారు. అంగన్వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కవిత, పద్మజ, జయమ్మ, తోటి కార్యకర్తలతో కలిసి పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అనంతరం దున్నపోతుకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

డిమాండ్ల కోసం న్యాయపోరాటం...

చిన్నమండెం, జనవరి2: అంగన్వాడీల డిమాండ్ల కోసం న్యాయమైన రీతిలో పోరాడుతున్నట్లు, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దున్నపోతుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అంగన్వాడీలు ఇచ్చారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు తమ న్యాయమైన డిమాండ్ల కోసం న్యాయపోరాటం చేస్తున్నా ప్రభుత్వం ఎలాంటి కనికరం చూపక పోవడం దారుణమన్నారు. అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అన్నాక్యాంటీన్‌కు విశేష స్పందన



అన్నా క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న పేదలు

రాజంపేట, జనవరి2: స్థానిక ఆర్ఎస్‌రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం పక్కన టీడీపీ నేత గంటా నరహరి ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌కు విశేష స్పందన లభిస్తోంది. మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి పలుకూరు ఉగ్రవీంద్ర పాల్గొన్నారు. 11.30గంటలకే 400 మంది పేదలు భోజనం చేశారు.

కార్మికుల సమ్మెతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్



సచివాలయ ఉద్యోగులతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్

రాయచోటిటౌన్, జనవరి2: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మెకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. మంగళవారం వరకు 72 మంది కార్మికులు సమ్మెలో ఉండగా బుధవారం నుంచి మిగిలిన 97 మంది కార్మికులతో కలిసి మొత్తం 169 కూడా సమ్మెలోకి వెళ్తున్న నేపథ్యంలో పట్టణ పారిశుధ్యం దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో కమిషనర్ గంగాప్రసాద్ సమీక్షించారు. బుధవారం నుంచి దినసరి కూలీలు 50 మందితో ప్రజారోగ్యం దృష్ట్యా పట్టణంలో పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు చెత్త సేకరణ ఆటోలు వీధుల్లోకి పంపే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా డంపర్ బిన్లలో, చెత్తసేకరణ ఆటోలకు చెత్తను అందించి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ఈ సమీక్షలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మల్లికార్జున, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కొండయ్య, మేస్త్రీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఆరాధనోత్సవాలు

రామాపురం, జనవరి2: కేవలానంద లక్ష్మణార్య స్వామిజీ వార్షిక ఆరాధనోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. 64 ఏళ్లగా పూజలు అందుకుంటూ మహిమాన్వితులుగా రాయలసీమ భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా స్వామిజీ నిలిచారని వక్తలు కొనియాడారు. నేటికీ ఆయన చెంతన సాంత్వన లభిస్తోందనేది భక్తుల విశ్వాసం. పాలన్నగారిపల్లె, సరస్వతిపల్లె కాలనీ, రాయచోటి, మదనపల్లె తదితర ప్రాంతాల భక్తులు అఖండ భజనలు చేశారు. వైభవంగా సాధు జెండా ప్రదర్శన నిర్వహించారు. పీఠాధిపతి స్వామి చిన్మయానంద ఆధ్వర్యంలో గురుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జిల్లా అధికారి గోదాము అకస్మిక తనిఖీ

లక్కిరెడ్డిపల్లె,జనవరి2: అన్నమయ్య జిల్లా పౌరసరపరాల శాఖ అధికారి రఘురాం నిత్యావసర సరుకుల గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకవివలుగల బియ్యాన్ని లబ్ధిదారులకు సకాలంలో అందించాలన్నారు. పండుగ సీజను కాబట్టి సరుకులు వలెంటీర్ల ద్వారా లబ్ధిదారులకు చేరేలా చూడాలన్నారు. అనంతరం ఓ దుకాణాల్లో సిలిండర్ నుంచి గ్యాస్ కిలోల ప్రకారం విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం లక్కిరెడ్డిల్లెలోని అన్ని రేషన్‌షాపులను తనిఖీ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఉస్మాన్‌సాబ్, గోదాము ఇన్‌చార్జి మల్లికార్జునబాబు పాల్గొన్నారు.

బస్సు యాత్రను అడ్డుకుంటాం

జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర

రైల్వేకోడూరు, జనవరి 2: వైసీపీ బస్సు యాత్రను అడ్డుకుంటామని జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తెలిపారు. స్థానిక జనసేన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ బుధవారం రైల్వేకోడూరులో వైసీపీ బస్సు యాత్ర చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఏమి చేశారని బస్సు యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏ మాత్రం అభివృద్ధి లేకుండా సామాజిక సాధికారత పేరుతో బస్సు యాత్ర చేస్తోందని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. మంగంపేట ఔట్‌సోర్సింగ్ బాధితులకు ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. రైతులకు పంట నష్టపరిహారం ఇంత వరకూ ఇవ్వలేదన్నారు. రైల్వేఅండర్ ప్యాసేజ్ పనులకు రెండు సార్లు టెంకాయలు కొట్టి భూమి పూజ చేశారన్నారు. వైసీపీ పరిపాలనలో ఎవరూ క్షేమంగా లేరన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని ప్రజల్ని మోసం చేయడానికి పనులకు భూమి పూజలు చేస్తున్నారని ఆరోపించారు. మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, సీనియర్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను తీర్చాలని ఎంపీడీఓకు వినతి

ఓబులవారిపల్లె, జనవరి2: చిన్నఓరంపాడు కమ్మపల్లిలో తాగునీటి సమస్య తీర్చాలని ఎంపీడీఓ విజయరావుకు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. తాగునీటి మోటారు ఉన్న బావిలో జారిపోవడం వల్ల ప్రత్యామ్నాయ మార్గాల్లో భాగంగా సర్పంచ్‌కు సమాచారంతో నూతన మోటారును ఏర్పాటు చేస్తామని తెలిపారు. వారం రోజులుగా తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నామని ఎంపీడీఓ విజయ్‌రావుకు గ్రామస్తులు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జనవరి 2: రాజంపేట మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు మంగళవారం బియ్యం పంపిణీ చేశారు. చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతూ వారం రోజులుగా ఆందోళన చేస్తున్న 92 మంది కార్మికులకు ఒక్కొక్కరికి 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.

నిర్లక్ష్యధోరణి విడనాడాలి : జగన్

రాజంపేట, జనవరి8: ఎనిమిది రోజులుగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తుంటే వారిపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దారుణమని టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. రాజంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడారు.

చంద్రబాబును కలిసిన ముక్కా రూపానందరెడ్డి



చంద్రబాబుతో ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, జనవరి 2: స్థానిక వైసీపీ నేత ముక్కా రూపానందరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉండే రూపానందరెడ్డి వైఎస్ మరణానంతరం వైసీపీలో చేరారు. ప్రస్తుతం ఈయన వైసీపీకి దూరంగా ఉంటూ నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వైసీపీలో బలమైన నేతగా ఉన్న ఈయన ప్రస్తుతం చంద్రబాబును కలవడంతో కోడూరు రాజకీయాలు మలుపు తిరగనున్నాయి.

వరదయ్యగారిపల్లెలో భవిష్యత్తుకు గ్యారెంటీ

రాజంపేట టౌన్, జనవరి2: వరదయ్యగారిపల్లెలో మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. బూత్ కన్వీనర్ కామినేని సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీలో ఇంటింటికీ వెళ్లి గ్యారెంటీ పత్రాలు అందజేసి పథకాల గురించి ప్రజలకు వివరించారు. మారోతు సుబ్బనరసయ్య, వెంకటయ్య, శంకరయ్య, పాల్గొన్నారు.

జాతీయ కుస్తీపోటీల్లో రాజంపేట ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

రాజంపేట టౌన్, జనవరి2: ఇటీవల విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో నిర్వహించిన బీచ్ గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్ 2023 పోటీల్లో రాజంపేట విద్యార్థి ఎం.మల్లికార్జునరెడ్డి ప్రతిభ కనబరిచారు. అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం ఏఐఎంఎల్ విద్యార్థి ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు. ఫిబ్రవరిలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ, కొటాయం కేరళలో జరగబోయే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో జేఎన్టీయూ వర్సిటీ హ్యాండ్ బాల్ టీమ్‌కు ఎంపికైన మల్లికార్జునరెడ్డి, రెజ్లింగ్‌లో కాంస్య పతకం సాధించిన ఫైనల్ ఇయర్ సివిల్ విద్యార్థులు టి.నర సింహ పవన్‌రెడ్డిని కళాశాల యాజమాన్యం డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మన్ యల్లారెడ్డి, ఈడీ అభిషేక్‌రెడ్డి అభినందించారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించండి

- అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా



ఓటర్ల జాబితాపై ఆరాతీస్తున్న కలెక్టర్ గిరీషా

రాయచోటిటౌన్, జనవరి2: నియోజకవర్గ ఓటరు జాబితా తప్పులు లేకుండా రూపొందించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా నియోజకవర్గ ఈఆర్ఓ, రాయచోటి ఆర్డీఓను ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి నియోజకవర్గ ఓటరు జాబితాలో ఒకే ఫొటో సారూప్య ఓట్లు (ఫొటో సిమిలర్ ఎంట్రీ పీఎస్ఈ) ఒకే పేరుతో ఇతర ఫొటోతో ఎక్కువ ఓట్లు (డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీ-డీఎస్ఈ) సవరణపై తీసు కుంటున్న చర్యలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ప్రచురించిన ఓటరు జాబితాలో 3541 పీఎస్ఈ ఓట్లు రాగా వాటిని పరిశీలించి పరిష్కరించామని, సాంకేతిక కారణాలతో 83 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 503 డీఎస్ఈ ఓట్లను పూర్తిగా పరిశీలించి పరిష్కరించామని ఆర్డీఓ రంగస్వామి కలెక్టర్‌కు వివరించారు. అవసరమైతే సాంకేతిక సమస్యపై ఎలెక్షన్ కమిషన్ కార్యాలయంతో మాట్లాడవచ్చన్నారు.

'సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా'

రాయచోటి(కలెక్టరేట్), జనవరి2: సమగ్ర శిక్ష పరిధి మండల విద్యాశాఖ కార్యాలయం, కేజీబీవీల్లో విధులు నిర్వర్తించే వివిధ విభాగాల ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక దీక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమం ఆఫ్ టైం స్కేల్, హెచ్ఆర్ఏ, డీఏ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్లను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను విద్యాశాఖ మంత్రి, స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం అందేలా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

'ఉప్పరపల్లె షాపింగ్ కాంప్లెక్స్‌పై చర్యలు ఎక్కడ'

సిద్దవటం, జనవరి2: ఉప్పరపల్లె షాపింగ్ కాంప్లెక్స్ తొలగించి డీకేటీ స్థలాలను పేదలకు పంచిపెట్టాలని టీడీపీ రాజంపేట బీసీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి శివప్రసాద్ డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డీకేటీ స్థలాల్లో నిరుపేదలు ఇంటి నిర్మాణం చేపట్టాలని పట్టాలు మంజూరు చేస్తే వాటిని లబ్ధిదారుల నుంచి తీసుకుని కొందరు బడానేతలు ఏకంగా షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసుకోవడం దారుణమన్నారు. ఈ విషయంపై ఆర్డీఓ కార్యాలయంలో ఏఓను అడగగా అప్పీలు అయ్యాయని వాటి కాపీలు తహశీల్దారు తీసుకెళ్లడం లేదని తెలిపారు.

క్రీడాహబ్‌గా జూనియర్ కళాశాల ఆవరణ

వీరబల్లి, జనవరి2: వీరబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కడప లివిన్ డయాగ్నోస్టిక్ ఎండీ గాలివీటి వివేకానందరెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని జరిపే క్రికెట్ గ్రౌండ్ ఆవరణ చదును చేయించి గ్రౌండ్ నెలకొల్పారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకుంటామని, ఉత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామని ఆయన వెల్లడించారు.

ఏపీ దళిత మిత్ర సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

రాయచోటిటౌన్, జనవరి2:1దళిత మిత్ర సంఘం అన్నమయ్య జిల్లా నూతన కమిటీ ఎన్నిక పట్టణంలోని దళిత మిత్ర సంఘం జిల్లా కార్యాలయంలో జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆలోచన విధానాలను అవలంభిస్తూ ప్రతి ఒక్కరూ ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కరకోటి కిశోర్‌బాబు, ఉపాధ్యక్షుడిగా జల్లా రెడ్డెప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ చాట్ల వీరయ్య, కోశాధికారిగా తలారి శంకరయ్య, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవ, కార్యదర్శి గంపాల ఆంజనేయులు ఎన్నికయ్యారు.

పంటలపై గజదాడులు



కూనపల్లి వద్ద కొబ్బరిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు, జనవరి 2: పులిచెర్ల మండలంలో సుమారు ఆరు నెలలుగా వ్యవసాయ పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. కావేటిగారిపల్లి పంచాయతీ కూనపల్లి సమీపంలోని పంటలపై మూడు రోజులుగా ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి. సోమవారం రాత్రి కూనపల్లికి చెందిన కొక్కే గోవిందయ్య పొలంలోని 20 ఏళ్ల కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో ఏనుగుల గుంపు పెకలిం చాయి. సమీపంలోని తమలపాకు తోటను ఏనుగులు తొక్కేశాయి. ఉదయం పొలంవద్దకు వెళ్లిన రైతుకు పంటలపై ఏనుగులు చేసిన దాడులను చూసి ఆందోళన వ్యక్తం చేశారు. కొమ్మిరెడ్డిగారిపల్లి నుంచి దామల్‌ చెరువుకు వెళ్లే రహదారిపైకి చేరుకున్న ఏనుగుల గుంపు ఘీంకారంతో వాహనదారులు భయపడి వెనక్కు వెళ్లిపోయారు. సుమారు 10 ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు.

పెట్రోల్‌ బంక్‌లో ముసుగు దొంగల హల్‌చల్‌

రూ.2.4 లక్షల చోరీ



దొంగతనం చేస్తున్న ముసుగుదొంగ

శ్రీరంగరాజపురం, జనవరి 2: శ్రీరంగరాజపురం మండలంలోని ఇండియన్‌ ఆయిల్‌ పెట్రోల్‌ బంకులో ముసుగు దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ షేక్షావల్లి తెలిపిన ప్రకారం.. ఇండియన్‌ పెట్రోల్‌ బంక్‌లో తలుపులు పగులగొట్టి సోమవారం రాత్రి ముసుగు వేసుకున్న దుండగులు రూ.2.40 లక్షలు చోరీ చేశారు. లక్ష్మీపురంలోని పెట్రోల్‌ బంకులోనూ చోరీకి ప్రయత్నించినట్లు నిర్వాహకులు తెలిపారు. పెట్రోల్‌ బంక్‌ యజమాని గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తిరుమల ఘాట్‌లో వాహనం బోల్తా

తమిళనాడు భక్తులకు స్వల్పగాయాలు



తిరుమల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండో ఘాట్‌లో మంగళవారం రాత్రి ఓ వాహనం బోల్తా పడింది. తమిళనాడుకు చెందిన ఆరుగురు భక్తులు శ్రీవారి దర్శనం కోసం టీఎన్‌ 22 బీఈ 2526 నెంబరు గల బొలెరో వాహనంలో తిరుమలకు బయల్దేరారు. రెండో ఘాట్‌లోని హరిణి ప్రాంతం సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.



మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఖాళీగా ఉన్న మూడు మహాప్రస్థానం వాహనాలు - అదే సమయంలో మృతదేహాలను తీసుకెళ్లడానికి ఎంఎం వార్డు, అత్యవసర విభాగం ముందున్న ప్రైవేటు అంబులెన్సులు

ప్రైవేటు అంబులెన్స్‌లదే హవా

రుయాస్పత్రిలో మహాప్రస్థానం వాహనాలుండీ ఉపయోగమేమి?

తిరుపతి సిటీ, జనవరి 2: రుయాస్పత్రిలో మృతదేహాలను ఉచితంగా తరలించడానికి నాలుగు మహాప్రస్థానం వాహనాలున్నాయి. ఏజెన్సీ తరపున నిర్వహించే ఈ వాహనాలకు నెలకు రూ.లక్ష చొప్పున రూ.4 లక్షలు బిల్లులైతే చెల్లిస్తున్నారు. అయినా ఇక్కడ ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకుల హవానే నడుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు మూడు మహాప్రస్థానం వాహనాలు అందుబాటులో ఉన్నాయి. అదే సమయంలో ఎంఎం వార్డు, అత్యవసర విభాగం నుంచి మృతదేహాలను తీసుకెళ్లడానికి ప్రైవేటు అంబులెన్స్‌లను బాధితులు ఆశ్రయించాల్సి వచ్చింది.

కమీషన్ల కోసమేనా?

ఆస్పత్రిలో రోజూ చికిత్స పొందుతూ ఏడు నుంచి తొమ్మిది మంది మృతి చెందుతుంటారు. ఇలా చనిపోయిన వారి వివరాలను వార్డులోని స్టాఫ్‌నర్సు, డాక్టరు వెంటనే మహాప్రస్థానం నిర్వాహకులకు తెలియజేయాలి. అలాగే ఉచితంగా మృతదేహాలను తీసుకెళ్లడానికి మహాప్రస్థానం వాహనాలు ఉన్నట్లు బాధితులకు తెలిసేలా బోర్డులు పెట్టాలి. అటువంటివేమీ ఇక్కడ కనిపించవు. మహాప్రస్థానం వాహనాలు, డ్రైవర్ల ఫోన్‌ నెంబర్లు వంటివి ఎక్కడన్నా చిన్నపాటి కాగితంపై చేతితో రాసి ఉంచుతున్నారు. ఎవరన్నా గుర్తించి అడిగితే వాహనాలు దూరంలో ఉన్నాయని, వచ్చేందుకు సమయం పడుతుందని అక్కడున్న సిబ్బంది చెబుతారు. అనంతరం ప్రైవేటు అంబులెన్స్‌లను రప్పించి, బాధితులకు సాయం చేస్తున్నట్లుగా నమ్మిస్తున్నారు. దీనికంతటికీ కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారులతోపాటు మహాప్రస్థానం వాహనాల నిర్వాహకులకు కూడా కమీషన్లు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి.



మార్చురీ వద్ద చిత్తు కాగితంపై రాసి అతికించిన మహాప్రస్థానం వాహన వివరాలు, డ్రైవర్ల ఫోన్‌ నెంబర్లు

పోలింగ్‌ స్టేషన్లవారీగా వసతుల కల్పనపై నివేదిక ఇవ్వండి

అధికారులకు కలెక్టర్‌ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్‌, జనవరి 2: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్‌ స్టేషన్లవారీగా వసతుల కల్పనపై పూర్తినివేదికను అందజేయాలని పంచాయతీరాజ్‌ ఇంజినీరింగ్‌ అధికారులను కలెక్టర్‌ షన్మోహన్‌ ఆదేశించారు. దీనిపై మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధశాఖల అధికారులతో సమీక్షించారు. అవసరమైన ఫర్నిచర్‌, విద్యుద్దీకరణ, మరుగుదొడ్ల ఏర్పాటు, ర్యాంపుల నిర్వహణ తదితరాలపై శుక్రవారంలోగా నివేదిక అందజేయాలని పీఆర్‌ ఎస్‌ఈ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. పీవో, ఏపీవో, సెక్టోరల్‌ అధికారుల నియామకాలకోసం సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది వివరాలను అందజేయాలన్నారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్‌, జడ్పీ సీఈవో ప్రభాకర్‌ రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, డీఈవో విజయేంద్రరావు, డీఎల్డీవో రవికుమార్‌, చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీవోలు చిన్నయ్య, మనోజ్‌కుమార్‌ రెడ్డి, శ్రీనివాసులు, సుజన, చిత్తూరు, పుంగనూరు, పలమనేరు మున్సిపల్‌ కమిషనర్లు అరుణ, నరసింహప్రసాద్‌, కిరణ్‌కుమార్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమీక్షలు - సమావేశాలు

'స్వీప్‌ యాక్టివిటీస్‌'పై సమావేశం: కలెక్టరేట్‌లోని మీటింగ్‌ హాల్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో ఈ సమావేశం జరిగింది. పోలింగ్‌ సరళిపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు 25న మాక్‌పోల్‌ నిర్వహించాలని కలెక్టర్‌ షన్మోహన్‌ సూచించారు. కళాశాల స్థాయిల్లో ఎలక్ట్రోల్‌ లిటరసీక్లబ్‌లు ఏర్పాటు చేసి, యువఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టిపెట్టాలన్నారు.

పాఠశాలల్లో వసతులు ఏర్పాటు చేయాలి

చిత్తూరు (సెంట్రల్‌): ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. చిత్తూరులోని పీసీఆర్‌లో ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు.

బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్‌: వ్యవసాయ రంగాభివృద్ధికి మరింత సహకారమందిస్తూ రుణాలు అందించాలని కలెక్టర్‌ షన్మోహన్‌ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. వైఎస్సార్‌ పంటల బీమా సౌకర్యం కల్పించేందుకు ముందుకు రావాలని, ఖాతాదారులకు రుణాలిచ్చేందుకు గ్రామాలవారీ వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో ఆర్బీఐ ప్రతినిధి నాగప్రవీణ్‌, నాబార్డు డీడీఎం సునీల్‌, ఇండియన్‌ బ్యాంకు జడ్‌ఎం రాజేష్‌, డీఆర్డీఏ పీడీ తులసి, మెప్మా పీడీ రాధమ్మ, పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్‌, వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, డీఐసీ జీఎం ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ భవన్‌ కోసం నిరసన దీక్ష



వి.కోట, జనవరి 2: వి.కోటలో అర్ధంతరంగా ఆగిన అంబేడ్కర్‌ భవన్‌ను పూర్తి చేయాలని దళిత సంఘాలు డిమాండు చేశాయి. మంగళవారం ఉదయం అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలు వేసిన అనంతరం సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. టీడీపీ హయాంలో ప్రభుత్వ బాలుర పాఠశాల వద్ద 28 సెంట్లలో అంబేడ్కర్‌ భవన్‌ నిర్మాణానికి టెండర్లు పిలిచారన్నారు. పునాదులు వేశారని తెలిపారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. దీని నిర్మాణం ఊసే ఎత్తకపోవడం బాధాకరమన్నారు. దళితుల ఓట్లతో గద్దెనెక్కి, ఆపై విస్మరిస్తున్న వారికి ఓటుతోనే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మండలంలో 22 వేలకుపైగా దళిత ఓటర్లు ఉన్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ అంబేడ్కర్‌ సేన నేతలు గణపతి, వినోద్‌, శివరాం, విశ్వనాథ్‌, గిరిబాబు, సుబ్రమణ్యం, గుర్రప్ప, శంకరావు, సేరేంద్ర, తంగరాజ్‌, మునిరత్నం, తాము, గౌతమ్‌ తదితరులు ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు

తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 63,358 మంది భక్తులు స్వామినిదర్శించుకున్నారు.19,534మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

జనసేన నేత పిటిషన్‌పై కౌంటర్‌ దాఖలు చేయండి

కిరణ్‌ రాయల్‌ కేసులో పోలీసు శాఖను ఆదేశించిన హైకోర్టు - తదుపరి విచారణ 9కి వాయిదా

తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి రోజాను విమర్శించారంటూ జనసేన తిరుపతి ఇంచార్జి కిరణ్‌ రాయల్‌పై కేసు నమోదు చేసిన నగరి పోలీసులు ఆయనకు సంబంధించిన మొబైల్‌ ఫోన్ల నుంచీ డేటా చౌర్యానికి పాల్పడ్డారంటూ దాఖలైన రిట్‌ పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం విచారణకు స్వీకరించింది. దీనిపై వారంలోగా కౌంటర్‌ దాఖలు చేయాలని హోంశాఖ జీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది. వివరాల్లోకి వెళితే....తిరుపతి జనసేన ఇంఛార్జి కిరణ్‌ రాయల్‌ 2022 అక్టోబరు 16న మీడియా సమావేశంలో మంత్రి రోజాపై విమర్శలు చేశారు. ఇవి అనుచిత విమర్శలంటూ నగరి, పుత్తూరుల్లో వైసీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో ఆయనపై అదే నెల 18న కేసు నమోదైంది.నవంబరు 11న ఈ కేసులో నగరి పోలీసులు తిరుపతిలో కిరణ్‌ రాయల్‌ను ఆయన ఇంటిలో వుండగా అదుపులోకి తీసుకుని నగరికి తరలించి మరుసటి రోజు అక్కడి కోర్టులో హాజరుపరిచారు. కాగా కిరణ్‌ రాయల్‌ను అదుపులోకి తీసుకున్నపుడు ఆయనకు, ఆయన సతీమణికి చెందిన రెండు మొబైల్‌ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆయన పోలీసు కస్టడీ నుంచీ విడుదలయ్యాక నవంబరు 23న పోలీసుల స్వాధీనంలో వున్న తన మొబైల్‌ ఫోన్లను తిరిగి అప్పగించాల్సిందిగా కోర్టులో పిటిషన్‌ వేశారు. దీనిపై కోర్టు మొబైల్‌ ఫోన్ల నుంచీ ఎలాంటి సమాచారం ఇతరులకు లీక్‌ చేయకూడదంటూ పోలీసులను ఆదేశించింది. కిరణ్‌ రాయల్‌ హైకోర్టును ఆశ్రయించడంతో అతనిపై నమోదు చేసిన సెక్షన్‌ 294 మినహా మిగిలిన సెక్షన్లను కొట్టివేసింది. అదే సమయంలో సాక్ష్యాధారాల కింద తీసుకున్న అతని రెండు మొబైల్‌ ఫోన్ల నుంచీ మంత్రి రోజా గురించి మాట్లాడిన వీడియో మినహా మరే ఇతర సమాచారం సేకరించరాదని ఆదేశించింది. ఫోన్ల నుంచీ కేసుకు అవసరమైన డేటాను ఫోరెన్సిక్‌ ల్యాబ్‌ నుంచీ మాత్రమే సేకరించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు నగరి కోర్టు సంబంధిత మొబైళ్లను భద్రపరచాలని,దాని నుంచీ ఎవరూ ఎలాంటి సమాచారం సేకరించకుండా కట్టడి చేయాలని కోర్టులో సంబంధిత ప్రాపర్టీ క్లర్కును ఆదేశించింది. అయితే కోర్టు అనుమతి లేకుండా పోలీసులు మొబైల్‌ ఫోన్లను తీసుకెళ్ళినట్టు తేలడంతో కలకలం రేగింది.ఈ నేపథ్యంలో కిరణ్‌ రాయల్‌ తాజాగా హైకోర్టును ఆశ్రయించారు. తన ఫోన్ల నుంచీ పోలీసులు డేటా చౌర్యానికి పాల్పడ్డారని, అందులోని ఫోటోలను మార్ఫింగ్‌ చేసి సోషల్‌ మీడియాలో పెడతామని బెదిరిస్తున్నారంటూ తన రిట్‌ పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజా సమస్యలు లేవనెత్తుతున్న ప్రతిపక్ష నేతల ఫోన్ల నుంచీ డేటా దొంగలించడం గోప్యతా హక్కును హరించడమేనని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆయన హైకోర్టును కోరుతూ గత నెల 27వ తేదీన రిట్‌ పిటిషన్‌ దాఖలు చేయగా 29వ తేదీన పిటిషన్‌ రిజిస్టరై (రిట్‌ పిటిషన్‌ నంబరు 33578-2023) మంగళవారం విచారణకు వచ్చింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన జడ్జి జస్టిస్‌ భానుమతి వారంలోగా కౌంటర్‌ దాఖలు చేయాల్సిందిగా హోంశాఖ జీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నగరి డీఎస్పీ రవికుమార్‌, నగరి అర్బన్‌ పోలీస్‌ స్టేషన్‌ హౌస్‌ ఆఫీసర్‌, మునుపటి నగరి సీఐ, ప్రస్తుత నిండ్ర సీఐ శ్రీనివాసంతి, నగరి అర్బన్‌ పోలీస్‌ స్టేషన్‌ కోర్టు కానిస్టేబుల్‌ రాజశేఖర్‌లను కిరణ్‌ రాయల్‌ ప్రతివాదులుగా పేర్కొన్నారు. కాగా కిరణ్‌ రాయల్‌ తరపున న్యాయవాది పి.వి.జి. ఉమేష్‌ చంద్ర కేసు వాదిస్తున్నారు.

గుప్తనిధుల కోసమే ఆలయాల కూల్చివేత

- ముక్కంటి ఆలయంలో లక్ష్మీదేవి విగ్రహం మాయం
- వైసీపీ నేతలపై సుధీర్‌ రెడ్డి ఫైర్‌

శ్రీకాళహస్తి జనవరి 2: గుప్త నిధుల కోసమే వైసీపీ నేతలు ఆలయాలను కూల్చి వేస్తున్నారని... ముక్కంటి ఆలయంలో లక్ష్మీదేవి విగ్రహాన్ని మాయం చేశారని టీడీపీ ఇంచార్జ్‌ బొజ్జల సుధీర్‌ రెడ్డి ఆరోపించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ సన్నిధి పక్కన ఉన్న గోడల కూల్చివేతపై మంగళవారం సుధీర్‌ రెడ్డి టీడీపీ నేతలతో కలిసి ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శ్రీకాళహస్తిలో వరదరాజస్వామి ఆల యం కూల్చివేసిన సమయంలోనే గుప్త నిధులను హైదరాబాద్‌లో ఎమ్మెల్యే విక్రయిస్తున్నట్లు వెల్లడించానన్నారు.దీంతో తన మీద రూ.2 కోట్లకు పరువు నష్టం దావా వేశారని గుర్తు చేశారు. విజ్ఞానగిరి వద్ద వినాయక స్వామి ఆలయం, ఊరందూరులో నీలకంఠేశ్వరాలయం, ఏడు గంగమ్మ ఆలయాలను పునర్నిర్మాణాల పేరుతో కూల్చివేశారన్నారు. ఇవన్నీ గుప్త నిధుల కోసమే ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద గోడలు కూల్చివేసిన ప్రదేశంలో ఉన్న లక్ష్మీదేవి విగ్రహాన్ని మా యం చేశారని ఆరోపించారు.దేవదాయ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. వైసీపీ అధికారంలోకి రాక ముందు రూ.200కోట్లకు పైగా నిధులు ముక్కంటి ఆలయానికి ఉన్నాయన్నారు. ప్రస్తుతం రూ.20కోట్లు ఉంచి మిగతాది స్వాహా చేసేయడం బాధాకరమన్నారు.పురాతన కట్టడాలు ఎందుకు కూల్చివేస్తున్నారని ఈవో రామారావును అడిగితే హాస్యాస్పదంగా సమాధానం ఇచ్చారని చెప్పారు. వా రం రోజుల్లో ఆలయంలోని టికెట్‌ కౌంటర్లు, లడ్డు పోటు, అన్నదానం స్టోర్‌, ఇంజనీరింగ్‌ విభాగం, నిధుల దుర్వినియోగం, ఉద్యోగుల బదిలీల్లో అవినీతి, గోశాలలో కుంభకోణం అన్ని అంశాలపై తిరుపతిలో విలేకరుల సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను బహిర్గతం చేస్తానన్నారు.ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలిలో రౌడీలకు స్థానం కల్పించడం సిగ్గుచేటన్నారు. మండలిలోని ఓ ప్రత్యే క ఆహ్వానితుడు సోమవారం రాత్రి ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనను ఇందుకు ఉదాహరణగా ఆయన చెప్పారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించాలి



ఎస్‌ఐలతో సమావేశమైన సీఐ మధు

ములకలచెరువు, జనవరి 2: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం నాలుగు మండలాల ఎస్‌ఐలతో జరిగిన నేరాలపై సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. చోరీలు, కోడిపందెలు, పేకాటపై ఉక్కుపాదం మోపాలన్నారు. నేరాలను అరికట్టేందుకు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల ఎస్‌ఐలు గాయత్రి, రవీంద్ర, లోకేశ్వర్‌రెడ్డి, రామాంజనేయుడు పాల్గొన్నారు.

ఆటో బోల్తా..మహిళకు గాయాలు

రామసముద్రం, జనవరి 2: ఆటో బోల్తా పడి లలితమ్మ అనే మహిళకు గాయాలైన సంఘటన మండలంలోని తిరుమలరెడ్డిపల్లె వద్ద మంగళవారం చోటుచేసుకుంది. జంగాలపల్లెకు చెందిన నలుగురు మహిళలు ఆటోలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఆటోను ఢీకొనడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న లలితమ్మకు గాయాలు కాగా ఆమెను 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.కాగా మదనపల్లె మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆస్పత్రిలో గాయపడ్డ మహిళను పరామర్శించి ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌లను కోరారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

కలకడ, జనవరి 2:మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ కోనేనివాండ్లపల్లెకు సమీపంలో జూదం ఆడుతున్న ఆరుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. వారి నుంచి రూ.50,390 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది హరిబాబు, లక్ష్మీనారాయణ, యూనస్, తాతయ్య, కరుణాకర్, రమేష్, గురవయ్యలు పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో నలుగురు..

నిమ్మనపల్లి, డిసెంబరు 2: మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతి పిట్లావాండ్లపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురి పట్టుకొని వారి వద్దనుంచి రూ.2300లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ రాయకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పిట్లావాండ్లపల్లి సమీపంలోని నీళ్ల ట్యాంకు వద్ద గత కొన్ని రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి నలుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

20లీటర్ల సారా స్వాధీనం..వ్యక్తి అరెస్ట్



నాటుసారా పట్టుబడ్డ నిందితుడితో పోలీసులు

నిమ్మనపల్లి, డిసెంబరు 2: గుట్టుచప్పుడు కాకుండా నాటుసారాను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ముష్టూరు గ్రామంలో దిగువపల్లిలోని చింతచెట్టు కింద నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించి మంజునాథ్(37)అనే వ్యక్తినిఅరెస్టు చేసినట్లు తెలిపారు.

జయహో బీసీ సమావేశాన్ని విజయవంతం చేయండి

కురబలకోట, జనవరి 2: మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఈ నెల 4న ఉదయం 10గంటలకు నిర్వహించనున్న జయహో బీసీ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అంగళ్లలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న బీసీ విభాగం అధ్యక్షుడు కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించే బీసీలతో సమాశానికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ సమావేశానికి రాజంపేట పార్లమెంట్ పరిధిలోని బీసీ నాయకులు, సాధికార కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ నేతను పరామర్శించిన టీడీపీ నేతలు



బీజేపీ నేతను పరామర్శిస్తున్న టీడీపీ నేత, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కువైట్ శంకర్

ములకలచెరువు, జనవరి 2: బీజేపీ నేత గోపాల్‌రెడ్డిని ములకలచెరువు మండల టీడీపీ నేతలు మంగళవారం పరామర్శించారు. చౌడసముద్రం సమీపంలో ఇటీవల జరిగిన దాడిలో బీజేపీ నేత గోపాల్‌రెడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో ములకలచెరువు టీడీపీ నాయకుడు, మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు కువైట్ శంకర్, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ కార్య నిర్వాహక కార్యదర్శి యర్రగుడి సురేష్, నాయకులు గొడ్డావుల రమణ తదితరులు పరామర్శించి ఘన జరిగిన తీరు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరితో కలిసి ఉండే గోపాల్‌రెడ్డిపై దాడి జరడగం దురదృష్టకరమన్నారు.

పారిశుధ్య నిర్వహణకు సహకరించండి

మదనపల్లె, జనవరి2: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు బుధవారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నందున పట్టణ ప్రజలు పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ రోడ్లపైన, కాలువల్లో పడివేయకుండా చెత్త ఆటోలు ఇంటి వద్దకు వచ్చినప్పుడు అందులో వేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని ప్రజలను కోరారు. సమ్మె నుంచి మున్సిపల్ కార్మికులు తిరిగి విధుల్లో చేరేవరకు పరిశుభ్రతకు పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యం తగదు



మదనపల్లెలో దున్నపోతుకు వినతి పత్రం అందిస్తున్న అంగన్వాడీలు



తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మదనపల్లె టౌన్, జనవరి 2: న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని అంగన్వాడీలు స్పష్టంచేశారు. దున్నపోతైనా తమ గోడు వింటుందేమో కాని రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తమ గోడు వినడం లేదని వారు ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు 22వ రోజు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సమ్మె చేస్తుంటే జిల్లా కలెక్టర్ తమను విధుల్లోకి చేరాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పత్రికా ప్రకటన ఇవ్వడం బాధకరమన్నారు. తమలో ఆవేదన ఆగ్రహంగా మారితే అంగన్వాడీలు కాళికామాతలై తిరగబడతారని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీగా వెళ్లి దిగువకమ్మపల్లెలో రోడ్డుపక్కన కట్టేసిన దున్నపోతుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, అంగన్వాడీ అసోసియేషన్ నాయకురాళ్లు మధురవాణి, గంగాదేవి, సుజన, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: కనీస వేతనం రూ.26వేలు, గ్రాట్యూటీ అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఉధృతంగా కొనసాగుతోంది. మంగళవారం నాటికి సమ్మె 22వ రోజుకు చేరుకోగా, ఇందులో భాగంగా, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. మంగళవారం తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు, సహాయకురాళ్లు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి తమ డిమాండ్లు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 22 రోజులుగా తమ సమస్యల పరిష్కారం పోరాటం చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు సులోచన, కరుణశ్రీ, స్వరూపారాణి, ఉమాదేవి, గౌరి, శివమ్మ, పరమేశ్వరీ తదితరు లు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో:బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. యథావిధిగా అంగన్వాడీ కార్యకర్తలు దీక్షా శిబిరంలో బైఠాయించి పాటలు పాడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాము వివిధ రకాలుగా నిరసన తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. అనంతరం దండాలు పెడుతూ అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ లీడర్లు కె. శ్రీవాణి, కుమారి, ఈశ్వరీలు మాట్లాడుతూ మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించక పోగా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆలోచన చేయడం, వెంటనే విధులలోకి చేరకపోతే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ల ద్వారా బెదిరించడం ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలన్నారు.



వాల్మీకిపురంలో ప్రాజెక్టు కార్యాలయం ఎదుట పొర్లు దండాలతో అంగన్వాడీ కార్యకర్తల నిరసనలు

వాల్మీకిపురంలో: అంగన్వాడీ కార్యకర్తలు ఈ నెల5వ తేదీలోపు విధులలో చేరాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉడుత బెదిరింపులకు ఎవ్వరూ బెదిరేది లేదని యూనియన్ అధ్యక్షురాలు చంద్రావతి పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పొర్లు దండాలు పెడుతూ వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలను బెదిరించే ప్రయత్నం మానుకోవాలని హెచ్చరించారు. గత 22రోజులుగా తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తుంటే పరిష్కరించక మళ్లీ విధులకు రావాల్సిందే అంటూ హుకుం జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ లీడర్లు భూకైలేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, గులాబ్‌జాన్, నజీమున్నీసా, సంపూర్ణ, లక్ష్మీప్రసన్న, నరసమ్మ, రెడ్డిరాణి, దేవసేన, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం, మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి..

జిల్లా కేంద్రమైన రాయచోటిలోని జిల్లా కలెక్టరేట్ ముట్టడికి బుధవారం అంగన్వాడీలు పిలుపునిచ్చారు. మేరకు వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీలు తరలి వచ్చి విజయవంతం చేయాలని యూనియన్ నాయకురాలు చంద్రావతి పిలుపునిచ్చారు.

గాలికుంటువ్యాధి నిర్మూలనకు టీకాలు

మదనపల్లెఅర్బన్, జనవరి 2: పశువుల్లో గాలికుంటువ్యాధి నిర్మూలనే లక్ష్యంగా టీకాలు వేయనున్నట్లు ఏడీ విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లె డివిజన్‌లోని అన్ని పశువైద్యశాలల్లో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా పశువులకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీ మాట్లాడుతూ గాలికుంటువ్యాధి వైరస్ వలన వ్యాపించే అంటువ్యాధి ప్రమాదకరమైనదన్నారు. వ్యాధి సోకడం వలన పశువుల్లో పాల దిగుబడి తగ్గి పశుపోషకులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. పశువుల శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉండి, నోటిలో చిగుళ్లు, నాలుక,మెట్టె లోపల ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడడం, మేత తినకుండా ఉండడం వ్యాధి లక్షణాలుగా తెలిపారు., 3 నెలల వయసు పైబడిన పశువు లన్నింటికి ఈ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. మదనపల్లె, సీటీఎం. నిమ్మనపల్లె సర్కిల్లో పశువులకు గాలికుంటువ్యాధికి ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. మదనపల్లె ఏడీ రోహిణి, సీటీఎం డాక్టర్ కేఎస్‌వీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బోరు వేసి నీటి సమస్య తీర్చిన టీడీపీ మాజీ సర్పంచ్



బోరు వద్ద గ్రామస్థులతో టీడీపీ మాజీ సర్పంచ్

గుర్రంకొండ, జనవరి 2:గుర్రంకొండ మండలం టి.పసలవాండ్లపల్లె పం చాయతీ నగిరిపల్లెలో గ్రామంలో తాగు నీటి బోరువేసి నీటి సమస్యను టీడీపీ మాజీ సర్పం చ్ పరిష్కరించారు. ప్రజ లు కొన్ని నెలలుగా తాగు నీటి కోసం తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో టీడీపీ మాజీ సర్పంచ్‌దొరస్వామినాయుడు కుమారుడు రామాంజులు తన సొంత నిధులు ఖర్చు చేసి బోరు వేసి నీటి సమస్యను తీర్చారు. బోరులో నీరు పుష్కలంగా పడడంతో మోటరును బిగించి నీటి సమస్యను తీర్చారు. గ్రామంలో తాగు నీటి సమస్య పరిష్కారం కావ డంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ షర్మిలను కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

బి.కొత్తకోట, జనవరి 2: వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎన్ చంద్రశేఖర్‌రెడ్డి కలిశారు. కుమారుడి వివాహ నేపథ్యంలో మంగళవారం తల్లి విజయమ్మతో కలసి షర్మిల ఇడుపులపాయకు వచ్చారు. మరో రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరికపై అధికారిక ప్రకటన చేయనున్నట్లు ఆమె ప్రకటించిన నేపథ్యంలో ఎంఎన్ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు షర్మిలను కలసి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..షర్మిల రాకతో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంటుందని, 2029లో అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. పీటీయం మండల అధ్యక్షుడు బావాజాన్ తదితరులు ఉన్నారు.

సైనిక్ స్కూల్ ఇంటర్నల్ పోటీల విజేత తుంగభద్ర విభాగం

కలికిరి, జనవరి 2: స్థానిక సైనిక్ స్కూల్‌లో జరిగిన ఇంటర్ హౌస్ క్రాస్ కంట్రీ క్రీడా పోటీల్లో తుంగభద్ర విభాగం విజేతగా నిలిచింది. సైనిక్ స్కూల్ ఇంటర్నల్ క్రీడా పోటీల్లో తుంగభద్ర, గోదావరి, పెన్నా, కృష్ణా విభాగాలు పోటీ పడ్డాయి. ఇంటర్ హౌస్ క్రాస్ కంట్రీ పోటీల పేరుతో జరిగే ఇంటర్నల్ క్రీడా పోటీల్లో మూడు కేటగిరీల్లో తుంగభద్ర విభాగం గెలుపొందిందని ప్రిన్సిపాల్ గ్రూప్ కెప్టెన్ పరదేశి తెలిపారు. సీనియర్స్‌లో వరుణ్, జూనియర్స్ విభాగంలో అంకిత్, బాలికల విభాగంలో భావన గెలుపొందారు. తుది ఫలితాల్లో తుంగభద్ర విభాగం ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. విజేతలకు ట్రోఫీ, పతకాలు అందజేశారు.

కేంద్ర పథకాలు అందరికీ చేర్చడమే లక్ష్యం

తంబళ్లపల్లె, జనవరి 2: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ చేరువయ్యేలా చేయడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం గోపిదిన్నె, కొటాల గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. చిన్నారులు దేశభక్తిపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం ప్రజలను ఆకట్టుకుంది. ప్రోగ్రాం కోఆర్డినేటర్ మనోహర్‌గౌడ్, మండల అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం చేసుకోకండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మురళి

మదనపల్లెఅర్బన్, జనవరి 2: మత్తుతో జీవితాలను నాశనం చేసుకోవద్దని డీఈవో శ్రీరామ్‌పురుషోత్తం, ఆర్డీవో మురళిలు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రస్తుతం చాలామంది పిల్లలు మత్తుపదార్థాలకు అలవాటుపడి వారి జీవితాలనే నాశనం చేసుకుంటున్నారన్నారు. చదువుకోవాల్సిన వయస్సులో ఇలాంటివి వినియోగించడం వలన చాలావరకు నేరాలకు పాల్పడుతున్నారని అది ఒక వ్యసనం అని తెలిపారు. ఎవ్వరైనా మత్తుకు అలవాటు పడివుంటే వెంటనే స్నేహితులు గుర్తించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మత్తు పదార్థాలు వాడకం వలన కలిగే నష్టాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో పతిజ్ఞ చేయించారు.. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వల్లిబసు, ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్ సైకాలజిస్ట్ సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

మదనపల్లె టౌన్, జనవరి 2: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని ఆర్డీవో మురళి సూచించారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్డీవో మురళి ఆవిష్కరించారు. ఏపీజీఈఎస్ జిల్లాకార్యదర్శి గురుప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షుడు నాగేంద్రబాబు, అసోసియేట్ అధ్యక్షుడు శేషయ్య, శివరామ్‌ప్రసాద్, ఉమాశంకర్, కిరణ్‌కుమార్, రమణ, ధర్మయ్య, సాయితరుణ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో: పీలేరు ఎంఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం ఎంఈవోలు లోకేశ్వరరెడ్డి, పద్మావతి ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో మంగళవారం యూటీఎఫ్ మండల శాఖ క్యాలెండర్‌ను ఎంఈవోలు వెంకటరమణ, శంకరయ్యలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, నాయకులు ఆనందరెడ్డి, గ్రేబియనాయక్, రామచంద్ర, ఆశీర్వాదం, అనీల్‌కుమార్, శంకర, ఆనంద్, రఫి, గంగులప్ప, సాయి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

పెద్దమండ్యం, జనవరి 2: విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవోలు మనోహర్, రామకృష్ణ పేర్కొన్నారు. పెద్దమండ్యం ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన యూటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఎంఈవోలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సురేంద్రరెడ్డి, హసన్, బాబు, గురునాథరెడ్డి, రమణ పాల్గొన్నారు.

ములకలచెరువులో పాస్టర్ల నిరసన



ములకలచెరువులో నిరసన తెలియచేస్తున్న పాస్టర్లు, బీఎస్పీ ఇన్‌చార్జి ప్రసాద్

ములకలచెరువు, జనవరి 2: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం క్రిస్టియన్ పాస్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల కొందరు పాస్టర్లపై అసత్య, నిరాధరణ ఆరోపణలు చేస్తూ మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని ఆందోళన చేపట్టారు. వారి నిరసనకు బీఎస్పీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్దిగాల ప్రసాద్ మద్దతు పలికారు. అనంతరం తమకు రక్షణ కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాసులుకుకు పాస్టర్లు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

● షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో భారీగా టీడీపీలో చేరిక



మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 2: రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని మదనపల్లె టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో 200 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిందరికి పార్టీ కండువాలు కప్పి ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన చూసి నచ్చక చాలా మంది టీడీపీలో చేరుతున్నారన్నారు. ముఖ్యంగా మదనపల్లె పట్టణంలోని చీకిలగుట్టకు చెందిన 3, 5 మున్సిపల్ వార్డులో సమస్యలు పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని దీంతో ఈ రెండు వార్డులకు చెందిన 200 మంది టీడీపీలో చేరారని, చంద్రబాబు సీఎం అయితేనే తమ వార్డులు బాగుపడతాయని ఇక్కడికి వచ్చారన్నారు. తనను నమ్మి వచ్చిన టీడీపీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానన్నారు. రాష్ట్రం సుభిక్షంగా వుండాలంటే చంద్రబాబు సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో చీకిలగుట్టకు చెందిన అక్కులప్ప, రాజన్న, షంషీర్, నాగూర్‌వలి, గిరీష్, పి.హరి, బాలుతో పాటు పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌లలో కనీస వసతులు కల్పించాలి



సెక్టోరియల్ అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో మురళి

మదనపల్లె టౌన్, జనవరి 2: మదనపల్లె నియోజకవర్గంలోని 259 పోలింగ్ స్టేషన్‌లలో కనీస వసతులు కల్పించాలని ఆర్డీవో మురళి ఆదేశించారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు వారి పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించి అక్కడ ర్యాంపులు, పీఎస్ నెంబర్లు, బీఎల్‌వోల మొబైల్ నెంబర్లు వేయాలన్నారు. విద్యుత్ సౌక ర్యం, మరుగు దొడ్లు తప్పని సరిగా ఉండేలా చూడాలన్నారు. ఈనెల 6వ తేదీలోపు సెక్టో రియల్ అధికారులు పూర్తి నివేదికలను ఏఆర్‌వోలకు, సంబంధిత ప్రభుత్వశాఖ అధికారు లకు అందజేయాలన్నారు. దీన్ని బట్టి నిధులు విడుదల అవుతాయని, పనులు పూర్తి చేయవచ్చన్నారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వద్దు



నిరసన తెలియచేస్తున్న ఆటో కార్మికులు, బహుజనపార్టీ నాయకులు

మదనపల్లెఅర్బన్ జనవరి 2: ఏపీలో రాబోవు ఎన్నికల ఫలితాల తర్వాత ఏ ప్రభుత్వం వచ్చిన మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ పథకం పెట్టవద్దని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు కోరారు. మంగళవారం స్థానిక చిత్తూరు బస్టాండ్‌లో ఆటో కార్మికులతో కలిసి బహుజన సేన నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచందు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ ప్రథకం ప్రవేశపెడితే లక్షలాదిమంది ఆటో కార్మికుల నష్టం కలుగుతుందన్నారు. ఇప్పటికే పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణాల్లో ఈ పథకం అమలు చేసి ఆటో కార్మికులకు కలుగుతున్న నష్టాన్ని చవిచూస్తున్నారని ఈ ఇబ్బందులు ఆంధ్రా ఆటో కార్మికులకు రాకుండా ప్రభుత్వం ముం దస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ముందే రాష్ట్రంలో సీఎం జగన్ ఈ పథకం అమలు చేస్తామనడం దారుణమన్నారు. కార్యక్రమంలో బహుజన సేన నాయకులు, ఆటో యూనియన్ నాయకులు రాఘవేంద్రయాదవ్, కొండపల్లె ఆనంద్, బాలాజీ నాయక్, శివ,రమణ, వాజిద్, వెంకటేష్,షరీఫ్, బావజాన్, బేకరీ శీనా,షఫీవుల్లా పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్ నాయకులు

నిమ్మనపల్లిలో: రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టి తమ కడుపులు కొట్టవద్దని మదనపల్లి ఆటో జేఏసీ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బస్టాండు కూడలిలో మదనపల్లి ఆటో జేఏసీ కమిటీ సభ్యులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణా రంగంలో, రైతు కూలీలు పండించే పంటలను మార్కెట్‌కు తరలించేందుకు ప్రధానపాత్ర పోషించేది ఆటో రంగమే అని అన్నారు. అలాగే అత్యవసర పరిస్థితులలో ఆసుపత్రికి సకాలంలో పేషంట్లను తరలించి కరోనా సమయంలో కూడా ప్రాణాలను లెక్కచేయ కుండా ప్రజలకు సేవలంది ఆటోలేనని అన్నారు. అలాంటిది ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పెడితే ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఒక వేళ ఆటో రంగం నష్టపోయో విధంగా నిర్ణయాలు చేపడితే ఆ పార్టీని వ్యతిరేకిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీరాములు, గంగులప్ప, రెడ్డెప్ప, రెడ్డిబాషా తదితరులు పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలతో హైకోర్టులో కేసు

కలికిరి, జనవరి 2: నిరాధారమైన అభియోగాలు మోపుతూ తమ పంచాయతీకి చెందిన కృష్ణారెడ్డిగారి మదనమోహన్‌రెడ్డి తనపై హైకోర్టులో కేసు వేశారని ఎస్వీ యూనివర్సిటీ పాలకవర్గ సభ్యుడుగా నియమితుడైన చీకటిపల్లె సర్పంచు టి. సురేంద్రనాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తనపై హైకోర్టులో వేసిన కేసు పంచాయతీ రాజ్, ఉన్నత విద్యా మండలి చట్టాలకు విరుద్ధంగా ఉందని తెలిపారు. తనకు అన్ని అర్హతలు ఉన్న కారణంగానే సర్పంచుగా పోటీ చేసి ఎన్నికయ్యాయన్నారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగిగా పనిచేస్తూ ప్రభుత్వం నుంచి వేతనం పొందడం సర్పంచుకు అనర్హులన్నారు. నిబంధనల మేరకే తనను పాలక మండలి సభ్యుడుగా నియమించారని వివరించారు. ఈ కేసులో ప్రతివాదిగా తాను కూడా కౌంటర్ దాఖలు చేసినట్లు చెప్పారు. న్యాయస్థానం తీర్పు మేరకు నడుచుకుంటానని చెప్పారు.

న్యూఇయర్ ద్వారా ఆర్టీసీకి రూ.6లక్షలు ఆదాయం



సమావేశం నిర్వహిస్తున్న వన్‌డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి

మదనపల్లెఅర్బన్ జనవరి 2: మదనపల్లె వన్‌డిపోకు న్యూఇయర్ స్పెషల్ బస్సులు నడపడం ద్వారా ఆర్టీసీ ఆదాయం రూ. 6లక్షలు వచ్చిన్నట్లు వన్‌డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ న్యూఇయర్‌కు సంబంధించి హార్సిలీహిల్స్‌కు 24 ప్రత్యేక సర్వీసులు 5603 కిలోమీటర్లు తిప్పి ఆర్టీసీకి రూ.4,60,063 ఆదాయం సాధించామన్నారు. ఇందులో ఈపీకే 82.11,ఓఆర్ 163, 176 టిప్పులతో 12132మందిని ప్రయాణికులను హార్సిలీహిల్స్‌కు తరలించామన్నారు. గత ఏడాది కంటే ఒక బస్సు ఎక్కువగా తిప్పి రూ. 41,019 అధికంగా ఆదాయం తెచ్చామన్నారు. మదనపల్లె నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ఈ ఏడాది ఆరు బస్సులు తిప్పి 1474 కిలోమీటర్లు ఆదాయం రూ.1,30,347 ఈపీకే 88.43.ఓఆర్ 176, టిప్పులు 53లతో 3047మంది ప్రయాణికులను మల్లయ్యకొండకు తరలించినట్లు డీఎం పేర్కొన్నారు. అధికంగా ఆదాయం తీసుకొచ్చిన ఆర్టీసీ ఉద్యోగులను డీఎం అభినందించారు. అలాగే మదనపల్లె టూ డిపో కార్యాలయంలో మంగళవారం టూ డిపో మేనేజరు నిరంజన్ ఆర్టీసీ ఉద్యోగులుతో సమావేశం ఏర్పాటు చేసి జనవరి 1న ఆర్టీసీ బస్సులు తలకోనకు నడిపి అధిక ఆదాయం చేకూర్చిన ఆర్టీసీ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజరు గీతా, రూట్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులానికి పూర్వ విద్యార్థుల వితరణ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, 1994 బ్యాచ్ విద్యార్థులు

పీలేరు, జనవరి 2: విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టి కేవీపల్లె మండలం గ్యారంపల్లెలోని గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు తమ పెద్దమనసు చాటుకున్నారు. పాఠశాలలోని విద్యార్థులు భోజనం చేయడానికి సరైన షెడ్డు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించి తమ స్వంత నిధులతో షెడ్డు ఏర్పాటు చేశారు. గ్యారంపల్లె గురుకులం ఇటీవల 40 వసంతాలు పూర్తి చేసుకుంది. నెల రోజుల క్రితం గురుకుల 40 వసంతాల ఉత్సవంలో సుమారు 1500 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. తాము చదువుకున్న పాఠశాలలో సరైన షెడ్డు లేక విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బందిగా ఉందని గమనించిన 1994వ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఆ షెడ్డు నిర్మాణం బాధ్యతలు తీసుకున్నారు. రూ.5 లక్షల నిధులు సమీకరించుకుని రేకుల షెడ్డు నిర్మించి మంగళవారం దానిని పాఠశాల ఉపాధ్యాయులకు అప్పగించారు. పూర్వ విద్యార్థుల వితరణకు గుర్తుగా ఉపాధ్యాయులు అక్కడ శిలాఫలకం ఏర్పాటు చేయడమే కాకుండా పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రవికుమార్, నరేశ్, పూర్ణ, వినోద్, గురుకుల్, అలుమ్ని కో-ఆర్డినేటర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.